RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ సంపుటి: 4 సంచిక:207 | ఆదివారం ఆగస్టు 30, 2026 | పేజీలు 5 వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



## వేపచెట్టు లొల్లి..
## ఇద్దరి చావుకు కారణమైంది

- గొడ్డళ్లతో ఇరువర్గాల పరస్పర దాడులు
- ఘటనా స్థలంలో ఒకరు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు మృతి
- ఘర్షణలో పలువురికి గాయాలు
- ఎస్ఐ నవీన్‌పై కూడా దాడి.. తలకు గాయాలు
- ఎర్రగడ్డ తండాలో తీవ్ర ఉద్రిక్తత
- భారీగా పోలీసు బందోబస్తు
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ
- సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో ఘటన

2లో





## బొగ్గు మసిలో విరిసిన నవ్వు..
## లారీ క్యాబిన్‌లో చదువు!

- వైరల్ గా మారిన శ్రామిక బిడ్డ అరుణ్ జీవితం
- లారీ డ్రైవర్ నెహ్రూ అండతో అక్షరాలు నేర్చుకున్న యువకుడు
- ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పూర్తి
- పేదరికాన్ని అధిగమించి స్ఫూర్తిగా నిలిచిన అరుణ్

5లో

## ఎస్ఐఆర్ ప్రక్రియలో
## పారదర్శకతకు ప్రాధాన్యం

- రాజకీయ పార్టీలతో సమాచారం పంచుకోవాలి
- ప్రతి దశను స్పష్టంగా నమోదు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారులతో సీఈవో సమీక్ష
- నోటీసుల పంపిణీ, విచారణలపై కీలక ఆదేశాలు




**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ శనివారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి కూడా పాల్గొన్నారు. సమావేశంలో ఎస్ఐఆర్–2026 కింద అభ్యంతరాలు, దరఖాస్తులు, నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఓటర్లకు జారీ చేసే ప్రతి నోటీసును బూత్ లెవల్ అధికారి స్వయంగా సంబంధిత ఓటరుకు అందజేయాలని, తప్పనిసరిగా అంగీకార పత్రం పొందాలని సీఈవో ఆదేశించారు. నోటీసు జారీ చేసిన తర్వాత కనీసం ఏడు రోజుల గడువు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విచారణ తేదీ, సమయం, ప్రదేశం గురించి ఓటర్లకు కనీసం రెండు రోజుల ముందుగానే బీఎల్ఓలు గుర్తు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అవసరమైన పత్రాల వివరాలు

మిగతా 2వ పేజీలో

# అర్హులైన ఒక్క ఓటరు పేరూ
# తొలగించొద్దు

- అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా చర్యలు తీసుకోవాలి
- ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, న్యాయం అవసరం
- గైర్హాజరు, నివాసం మారిన ఓటర్ల గుర్తింపుపై ఆందోళన
- పట్టణ ప్రాంతాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు
- అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలి
- గ్రామసభలు, వార్డు కమిటీల ద్వారా ముసాయిదా జాబితాలపై విస్తృత ప్రచారం
- రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులకు అదనపు సమయం ఇవ్వాలి
- ఓటర్ల సవరణకు అవసరమైన పరిపాలనా సహకారం అందిస్తాం
- ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు సీఎం లేఖ

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదని, అదే సమయంలో అనర్హులైన ఎవరూ ఓటర్ల జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, న్యాయం, ప్రజా భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2026 జూన్ 10 నాటికి తెలంగాణలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 73.39 లక్షల మందిని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన లేదా ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల సంఘం గణాంకాలను

మిగతా 2వ పేజీలో







## దివ్యాంగుల పెన్షన్ పెంపు
## హామీ ఏమైంది

- బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం
- కల్యాణలక్ష్మి లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

2లో

## నిర్ణీత గడువులోగా
## ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలి
- ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ
- టిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైద్య మౌలిక సదుపాయాల బలోపేతానికి కీలకమైన ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సమావేశంలో ఆయా ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులు మంత్రికి వివరాలు అందజేశారు. నిర్మాణ పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో ప్రాజెక్టులను పూర్తి చేసే అంశాలపై చర్చించారు. టిమ్స్ ఆల్వాల్,

మిగతా 2వ పేజీలో



## పాన్‌షాప్ ముసుగులో
## గంజాయి చాక్లెట్ల దందా!

- 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు స్వాధీనం
- యువత, చిన్నారులే ప్రధాన లక్ష్యం
- శామీర్‌పేట్‌లో నిందితుడు అరెస్ట్
- మాదకద్రవ్యాల నియంత్రణపై పోలీసుల అప్రమత్తత



**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ శామీర్‌పేట్ ప్రాంతంలో పాన్‌షాప్ ముసుగులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన బైద్‌నాథ్ అనే వ్యక్తి ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. మాదకద్రవ్యాల విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు దాడులు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి భారీ మొత్తంలో గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 25 కిలోల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. మార్కెట్లో సాధారణ చాక్లెట్ల మాదిరిగా కనిపించేలా వీటిని ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దర్యాప్తులో

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

ఆదివారం ఆగస్టు 30, 2026

## అర్హులైన ఒక్క ఓటరు పేరూ తొలగించొద్దు

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఇందులో 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరంగా ఉందని పేర్కొన్నారు. డిజిటలైజ్ చేసిన గణన పత్రాల్లో కూడా భారీ స్థాయిలో లోపాలు ఉన్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న ఓటర్ల జాబితా సవరణ విధానంలో కొన్ని కీలక లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గణన సిబ్బంది ఇంటికి వచ్చిన సమయంలో అందుబాటులో లేని వ్యక్తులను కూడా శాశ్వతంగా నివాసం మారిన వారిగా పరిగణించే పరిస్థితి ఉందని తెలిపారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు తగిన సహాయం అందించకుండానే పాత ప్రాంతంలోని ఓటును తొలగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అధికారిక నోటీసు ప్రక్రియను కూడా పూర్తిస్థాయిలో పాటించడం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. దీనివల్ల అనేక మంది ఓటర్లు పోలింగ్ రోజున తమ పేరు ఓటర్ల జాబితాలో లేదనే విషయాన్ని తెలుసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ఓటరుకు తన పేరు జాబితాలో కొనసాగించుకునే అవకాశం కల్పించకుండా తొలగించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన లేదా ఒకటికి మించి నమోదైన ఓటర్ల కేసులు అధికంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్ల చిరునామాలు మారుతుంటాయని, అలాంటి వారిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా పరిగణించడం వల్ల వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను మరింత సమగ్రంగా నిర్వహించేందుకు తగినంత సమయం కేటాయించాలని సీఎం సూచించారు. ప్రస్తుతం సెప్టెంబర్ 16తో ముగియనున్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రజలకు తమ అభ్యంతరాలు, ఆధారాలు సమర్పించేందుకు తగిన సమయం ఇవ్వడం ద్వారా సవరణ ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగుతుందని పేర్కొన్నారు. అలాగే గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి, గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాల ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి సూచించారు. రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులు తమకు సంబంధించిన పత్రాలను సమర్పించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని, వారికి కనీసం మూడు నుంచి నాలుగు వారాల అదనపు సమయం ఇవ్వాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటర్లకు అవసరమైన పత్రాలు, నమోదు, అభ్యంతరాలు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ప్రజలకు సులభంగా సమాచారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు తమ హక్కును కాపాడుకునేలా సహాయక వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామసభలు, వార్డు సమావేశాలు, సహాయ కేంద్రాల ఏర్పాటు సహా అవసరమైన పరిపాలనా సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తన లేఖలో స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా, అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా ఎన్నికల సంఘం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

## నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి**

టిమ్స్ ఎల్‌బీనగర్ ఆస్పత్రుల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టు రాష్ట్ర ఆరోగ్య రంగానికి కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అధునాతన వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య రంగంలో భారీ పెట్టుబడులు పెడుతోందని మంత్రి అన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

## పాన్‌షాప్ ముసుగులో గంజాయి చాక్లెట్ల దందా!

**మొదటి పేజీ తరువాయి**

యువత, చిన్నారులనే ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఈ గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. తక్కువ ధరలకు అందుబాటులో ఉంచి మాదకద్రవ్యాల అలవాటుకు యువతను ఆకర్షించే ప్రయత్నం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ చాక్లెట్ల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. నిందితుడు ఈ గంజాయి చాక్లెట్లను ఎక్కడి నుంచి తెప్పిస్తున్నాడు, మరెవరు ఈ నెట్‌వర్క్‌లో ఉన్నారు అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు కూడా వీటి సరఫరా జరిగిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉండే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడేందుకు ప్రజల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని, అపరిచిత ఆహార పదార్థాలు లేదా చాక్లెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం

**మొదటి పేజీ తరువాయి**

ప్రతి ఓటరికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విచారణల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని సహాయ ఎన్నికల నమోదు అధికారులు, అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులతో సంప్రదించి సమగ్ర విచారణ షెడ్యూల్ రూపొందించాలని సీఈవో సూచించారు. నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'నో మ్యాపింగ్' మరియు 'అనామలీస్' కేసులకు సంబంధించిన జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో పంచుకోవాలని సమావేశంలో సూచించారు. అలాగే అభ్యంతరాలు, దరఖాస్తులకు సంబంధించిన జాబితాలను రాజకీయ పార్టీల సమావేశాల్లో ప్రతి వారం అందుబాటులో ఉంచాలని తెలిపారు. దీనివల్ల ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్–2026లో ప్రతి దశను ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాల ప్రకారం నిర్వహించాలని, అన్ని చర్యలను సక్రమంగా నమోదు చేసి రికార్డు చేయాలని సీఈవో స్పష్టం చేశారు. నోటీసుల పంపిణీ, విచారణల షెడ్యూల్ తయారీ, కేసుల కేటాయింపు అంశాలపై అన్ని జిల్లాల పురోగతిని సమీక్షించిన ఆయన, నిబంధనలను కచ్చితంగా అమలు చేసినప్పుడే ఎస్ఐఆర్ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు, పీఎం సహా పలువురు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# వేపచెట్టు లొల్లి..
# ఇద్దరి చావుకు కారణమైంది



- గొడ్డళ్లతో ఇరువర్గాల పరస్పర దాడులు
- ఘటనా స్థలంలో ఒకరు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు మృతి
- ఘర్షణలో పలువురికి గాయాలు
- ఎస్ఐ నవీన్‌పై కూడా దాడి.. తలకు గాయాలు
- ఎర్రగడ్డ తండాలో తీవ్ర ఉద్రిక్తత
- భారీగా పోలీసు బందోబస్తు
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ
- సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో ఘటన





**వేద న్యూస్, సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో వేపచెట్టు వివాదం తీవ్ర ఘర్షణకు దారి తీసింది. శనివారం రెండు వర్గాల మధ్య జరిగిన పరస్పర దాడుల్లో ఇద్దరు మృతి చెందారు. గొడ్డళ్లతో దాడులకు దిగడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు యాజమాన్యం, దాన్ని తొలగించే అంశంపై రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం మరోసారి ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొద్దిసేపటికే పరిస్థితి అదుపు తప్పి పరస్పరం గొడ్డళ్లతో దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ దాడిలో వెంకటేశ్వర్లు యాదవ్ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో వ్యక్తి సైదా తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇద్దరి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి. సమాచారం అందుకున్న మేళ్లచెరువు పోలీసులు వెంటనే ఎర్రగడ్డ తండాకు చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. ఆగ్రహంతో ఉన్న కొందరు పోలీసుల చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఘర్షణను అదుపు చేసే క్రమంలో మేళ్లచెరువు ఎస్ ఐ నవీన్ పై కూడా దాడి జరిగినట్లు తెలిసింది. గొడ్డలితో దాడి చేయడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. వెంటనే సహచర పోలీసులు ఆయనను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటన నేపథ్యంలో ఎర్రగడ్డ తండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఘర్షణకు దారి తీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

# దివ్యాంగుల పెన్షన్ పెంపు హామీ ఏమైంది

**బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం**

**కల్యాణలక్ష్మిలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదు**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్**



**వేద న్యూస్, హైదరాబాద్**

దివ్యాంగుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. ఒకప్పుడు రూ.500గా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.4,016కు పెంచారని గుర్తు చేశారు. దివ్యాంగులకు రిజర్వేషన్లు పెంచడంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. దివ్యాంగుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ స్థాయిలో అవార్డు కూడా పొందిందని హరీశ్‌రావు తెలిపారు. గత ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడంలో విఫలమైందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. ఎన్నికల సమయంలో దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయలేదని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలోని దివ్యాంగులకు పెన్షన్ పెంపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సంక్షేమాన్ని కేవలం రాజకీయ హామీలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తన రాజకీయ గురువుగా పేర్కొంటారని హరీశ్‌రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ అందిస్తున్నప్పుడు తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. కళ్యాణలక్ష్మి పథకం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగులకు కళ్యాణలక్ష్మి సాయాన్ని రూ.2 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ప్రకటించి అమలు చేయకుండా తప్పించుకుంటోందని విమర్శించారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపు, సంక్షేమ పథకాల అమలు, దివ్యాంగుల హక్కుల పరిరక్షణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.




## గోల్ఫ్ టూరిజంపై తెలంగాణ భారీ ప్రణాళిక

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణను ప్రపంచ స్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శామీర్‌పేట్ సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే కృష్ణా నది తీరంలోని సోమశిలలో మరో ప్రపంచ స్థాయి గోల్ఫ్ కోర్స్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులు దేశ విదేశాల నుంచి ప్రొఫెషనల్, ఔత్సాహిక గోల్ఫర్లను ఆకర్షించడమే లక్ష్యంగా రూపొందుతున్నాయని పేర్కొన్నారు. సోమశిలలో ప్రతిపాదిత గోల్ఫ్ కోర్స్ కృష్ణా నది ఒడ్డున, నల్లమల అటవీ ప్రాంతం మధ్య, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ సమీపంలో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వివరించారు. ప్రకృతి సోయగాలు, క్రీడలు, పర్యాటకాన్ని మేళవించే ప్రత్యేక గోల్ఫ్ టూరిజం కేంద్రంగా ఈ ప్రాంతం రూపుదిద్దుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య విధానంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక వసతులతో సోమశిల గోల్ఫ్ టూరిజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నమెంట్‌కు సంబంధించిన విలేకరుల సమావేశంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ టూరిజం భాగస్వామ్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు.

# జర్నలిస్టులకు కష్టం వస్తే ముందుంటా

**జర్నలిస్టులతో నా అనుబంధం.. రాజకీయాలకు అతీతం**

**జర్నలిస్ట్ వనం భాస్కర్‌కు ఎల్ఓసీ ద్వారా ఉచిత వైద్యం**

**డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ప్రత్యేక చొరవ**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

జర్నలిస్టులు సమాజానికి నిత్యం సేవలందించే వారని, వారి కష్టసుఖాల్లో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ వెంటనే స్పందించి, మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా ఉచితంగా వైద్యం అందే విధంగా అవసరమైన చర్యలు చేపట్టి, సంబంధిత అధికారులతో సమన్వయం చేశారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ. వనం భాస్కర్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాను. జర్నలిస్టులంటే నాకు ఎంతో గౌరవం, ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గ జర్నలిస్టులతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నా ఎదుగుదలలో వారు అందించిన సహాయ సహకారాలను ఎప్పటికీ మర్చిపోలేను అని అన్నారు. జర్నలిస్టు ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు నాకు చేతనైనంత సహాయం చేయడం నా బాధ్యతగా భావిస్తాను. రాజకీయాలకు అతీతంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం నా వంతు సహకారం అందిస్తాను. భవిష్యత్తులోనూ జర్నలిస్టులకు అండగా ఉంటాను అని అయూబ్ స్పష్టం చేశారు. వనం భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఆయనకు అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమాజం కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కష్టకాలంలో జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలిచిన అయూబ్ చొరవకు జర్నలిస్టు వర్గాలు అభినందనలు తెలిపారు.

వేద న్యూస్

ఆదివారం ఆగస్టు 30, 2026

# విద్యార్థుల జీవితాలు ఆగం చేస్తారా..?



- రూ.15 వేల కోట్ల బకాయిలపై బీజేపీ ఆగ్రహం!
- రూ. 15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన దీక్ష

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు, ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిరసన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రూ. 15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. కనీసం విద్యాశాఖ మంత్రి కూడా లేని ఏకైక దుస్థితి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉందంటూ ఆయన దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని పక్షంలో ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేసే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల, మరోవైపు ఆయుష్ వైద్య విద్యార్థుల పట్ల అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక వైఖరిని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద జీవో 97 వల్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు, ఈసెట్ రాసే విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ఆందోళనలో పడిందని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా విద్యా రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనపరుస్తోందని ధ్వజమెత్తారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో ఆయుష్ విద్యార్థులకు అత్యంత తక్కువ స్టైపెండ్ ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎండగట్టారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావుని అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, నిరసనలను పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మారలేదని, విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. వెంటనే జీవో 97ను రద్దు చేయాలని, ఆయుష్ విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామని గంట రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, బీజేపీ నాయకులు ఆడేపు రవిరాము, రాళ్లబండి మున్నా, మహంత్, బాశెట్టి సాయి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, , రాయపురం కుమారస్వామి, పోనుగోటి వెంకట్ రావు,అంకాల జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు తెకుమట్ల రేణుక, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మదాసు రాజు, ఓబిసి మోర్చా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్, కర్నె రవీందర్, మెంతుల యాదగిరి, మార్తా ఉషారాణి, జీలకర్ర వీరస్వామి మరియు మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

- ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం




**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి కళ్యాణిఖని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత శ్రీలత సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పరీక్షలు ఎంతో ముఖ్యమని అన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తమ వంతు సహాయంగా పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహకరించేందుకు ఆసక్తి ఉన్న దాతలు, సేవాభిమానులు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీని సంప్రదించాలని కోరారు. దాతల సహకారాన్ని అవసరమైన వారికి చేరేలా సద్వినియోగం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, ఎండీ జావిద్ పాషా, అన్వేష్, సూర్య, ఇమామ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మాటలు కాదు.. ఫలితాలు కావాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి అఖిల భారత హిందూ మహాసభ తెలంగాణ బహిరంగ లేఖ

**వేద న్యూస్, నల్లబెల్లి:**



తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత హిందూ మహాసభ తెలంగాణ నాయకుడు కొనకటి రమేష్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎంకు బహిరంగ లేఖ విడుదల చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ ఖాళీలపై స్పష్టమైన క్యాలెండర్ ప్రకటించి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర, రుణభారం, ఎరువుల లభ్యత, పంట నష్టం పరిహారంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. మహిళలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, పేదలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమీక్ష వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.

## క్రీడలకు పెద్దపీట వేయాలి..ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి!

- కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్,హనుమకొండ :**



క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల రాజేష్ కోరారు. దిగ్గజ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్, స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబాల రాజేష్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులను త్వరితగతిన భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో తెలంగాణ క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఓఎస్డీ ప్రొఫెసర్ బైరి వెంకట్ రామ్ రెడ్డి, యూనివర్సిటీ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వెంకయ్య, ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ శాస్త్రి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులు ఆకాష్, మహేందర్, అజిత్, సురేష్, నవీన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శాయంపేట క్లస్టర్ ఏఈఓగా నందిపాక పూజ

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని శాయంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిగా నందిపాక పూజ నూతనంగా నియమితులయ్యారు. ఆగస్టు 29న విధుల్లో చేరిన ఆమె.. ఆగస్టు 30న క్లస్టర్ ఇన్‌చార్జి వ్యవసాయ విస్తరణ అధికారి నుంచి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని రైతులకు అవసరమైన వ్యవసాయ సాంకేతిక సూచనలు, పంటల సాగు, పురుగుతెగుళ్ల నివారణ, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ సమస్యలు, సందేహాలపై వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## భద్రాచలంలో పుష్కర ఘాట్ల నిర్మాణం ప్రారంభం

- రూ.49 కోట్లతో మూడు దశల్లో పనులు
- భూమిపూజలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే
- 2027 పుష్కరాలకు భక్తులకు మెరుగైన వసతులు

**వేద న్యూస్, భద్రాచలం**



గోదావరి పుష్కరాలు2027ను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భూమిపూజ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల కోసం రూ.49 కోట్లతో మూడు దశల్లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తొలి దశలో రూ.46.65 కోట్లు, రెండో దశలో రూ.1.75 కోట్లు, మూడో దశలో రూ.60 లక్షలు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భద్రాచలంతో పాటు పర్ణశాల, మోతెపట్టినగర్, ములుగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘాట్ల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున స్నాన ఘాట్లు, మరుగుదొడ్లు, తాగునీరు, విశ్రాంతి కేంద్రాలు వంటి వసతులు కల్పించాలని సూచించారు. కరకట్ట ప్రాంతంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ దామోదర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## సామాజిక సమానత్వానికి సహపంక్తి భోజనం

- రామతీర్థంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

**వేద న్యూస్, నల్లబెల్లి:**



రామతీర్థం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ ముప్పు కృష్ణ, అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, పౌరుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మండల అధికారులు గ్రామ ప్రజలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సామాజిక వివక్షకు తావులేకుండా సమానత్వం, సోదరభావంతో ముందుకు సాగాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయి ప్రసన్న, ఎంపీవో రవి, ఎంఈఓ అనురాధ, ఏవో రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏపీఎం సుధాకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆచార్య, వీఆర్ఏలు, ఏపీవో, రెవెన్యూ గిర్ధావర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పురాతన హనుమాన్ ఆలయాలకు పూర్వ వైభవం

- శ్రావణమాసం సందర్భంగా సింధూర చందన కార్యక్రమం

**వేద న్యూస్, పాపన్నపేట:**



శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పాపన్నపేట గ్రామంలోని పురాతన, నిరుపయోగంగా ఉన్న హనుమాన్ ఆలయాలకు సింధూర చందన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, ఆలయ పూజారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, పాడిపంటలు, పశుసంపద అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పాడుబడిన హనుమాన్ ఆలయాలకు సింధూరం పూసి, దీపాలు వెలిగించడం ద్వారా ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు గ్రామ సంస్కృతి, పురాతన ఆలయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి శ్రావణమాసంలో గ్రామంలోని ఏ పురాతన ఆలయాన్ని విస్మరించకుండా సింధూర అలంకరణ చేసేలా పూజారులతో కలిసి చర్యలు తీసుకుంటామని పావని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రాజకీయ నాయకులు, యువకులు, ఆంజనేయస్వామి భక్తులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం ఆగస్టు 30, 2026

# పాపన్నపేట బియ్యం గోదాంలో 'భాయ్' హవా!

- గోదాం ఇంచార్జి, హమాలీలపై పెత్తనం చేస్తున్నారంటూ డీలర్ల ఆరోపణ
- తనకు నచ్చిన రూట్లలోనే బియ్యం తరలిస్తున్నారనే విమర్శలు
- జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలని కార్డుదారుల విజ్ఞప్తి



**వేద న్యూస్, పాపన్నపేట:**

పాపన్నపేట మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదాంలో బియ్యం పంపిణీ వ్యవహారంపై రేషన్ డీలర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రెండు మండలాలకు చెందిన రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీ చేసే గోదాంలో స్టేజ్-2 కాంట్రాక్టర్ కృష్ణ భాయ్ పెత్తనం సాగుతోందని కొందరు డీలర్లు ఆరోపిస్తున్నారు. గోదాం ఇంచార్జి, హమాలీలను తన కనుసన్నల్లో ఉంచుకుని బియ్యం పంపిణీ వ్యవహారాన్ని ప్రభావితం చేస్తున్నారని వారు పేర్కొంటున్నారు. పాపన్నపేట, టేక్మాల్ మండలాలకు చెందిన రేషన్ డీలర్లకు ఈ గోదాం నుంచే బియ్యం సరఫరా అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల



రేషన్ కార్డుదారులకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఈ నెల 31లోగా పంపిణీ చేయాల్సి ఉంది. అయితే గోదాం వద్ద జరుగుతున్న జాప్యం కారణంగా గ్రామాల్లో కార్డుదారులకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు అనుకూలమైన రూట్లలోనే బియ్యం లోడ్ పంపాలని, లేకపోతే వాహనాలను నిలిపివేస్తున్నారని డీలర్లు ఆరోపిస్తున్నారు. బియ్యం పంపిణీ విషయంలో తమ మాట వినకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో గోదాం నుంచి బియ్యం సరఫరా వ్యవహారం సక్రమంగా సాగడం లేదని డీలర్లు అంటున్నారు. ఈ మొత్తం వ్యవహారం గోదాం ఇంచార్జి నరసింహారావుకు తెలిసినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదని కొందరు డీలర్లు ఆరోపిస్తున్నారు. గోదాంలో ఎవరి ఆదేశాల మేరకు బియ్యం లోడింగ్, రవాణా జరుగుతుందనే అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు. మూడు నెలల బియ్యాన్ని నిర్ణీత గడువులోగా కార్డుదారులకు అందించాల్సి ఉన్నందున జిల్లా పౌరసరఫరాల అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని గోదాం వ్యవహారాన్ని పరిశీలించాలని రేషన్ డీలర్లు, కార్డుదారులు కోరుతున్నారు. బియ్యం పంపిణీలో ఎలాంటి జాప్యం, అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుని అర్హులైన ప్రతి కార్డుదారుడికి సకాలంలో బియ్యం అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆరోగ్యకర జీవనశైలికి పరుగు అవసరం

- సెల్‌ఫోన్ వద్దు-పుస్తకమే ముద్దు
- సామాజిక బాధ్యతపై సీపీ రమేష్ పిలుపు
- ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌లో 5కే రన్
- 6,100 మంది పాల్గొన్న అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, హైదరాబాద్:**



ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు సామాజిక బాధ్యతపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ - 2026లో భాగంగా హెచ్ఐసీసీ నుంచి హైటెక్స్ వరకు నిర్వహించిన 5కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 6,100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వంపై శ్రద్ధ చూపాలని సూచించారు. క్రమం తప్పకుండా పరుగు, నడక, వ్యాయామం వంటి అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకమని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలని ఆకాంక్షించారు. పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని రమేష్ సూచించారు. 'సెల్‌ఫోన్ వద్దు-పుస్తకమే ముద్దు' అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. అవసరమైన పిల్లలకు కథల పుస్తకాలు, విద్యా సామగ్రి అందించడం ద్వారా పఠన సంస్కృతిని పెంపొందించవచ్చని తెలిపారు. రోహిణి ఫౌండేషన్ చేపట్టిన 'పవర్ ఆఫ్ 100' కార్యక్రమాన్ని కూడా సీపీ ప్రశంసించారు. సమిష్టి భాగస్వామ్యంతో సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, సీఎంసీ కమిషనర్ సృజన, విద్యార్థులు, రన్నర్లు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

- మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించిన కలెక్టర్
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కార్యక్రమం

**వేద న్యూస్, ఆదిలాబాద్:**



జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ భారత క్రీడా చరిత్రలో చిరస్మరణీయ వ్యక్తి అని పేర్కొన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. క్రీడారంగ అభివృద్ధికి సేవలందించిన పలువురు పూర్వ క్రీడాకారులను అధికారులు సన్మానించారు. శాలువాలు కప్పి మెమొంటోలు అందజేశారు. క్రీడా జ్యోతి ర్యాలీలో విద్యార్థులు, క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులను గుర్తించి శిక్షణ, ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. క్రీడలను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి దయానంద్ రెడ్డి, క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధ బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
- విద్యార్థినుల విద్య, భద్రతపై ప్రత్యేక దృష్టి
- ములుగు గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**వేద న్యూస్, హైదరాబాద్:**

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికాబద్ధమైన బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యా ప్రమాణాలు, సంక్షేమం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పాఠశాల, కళాశాలలో నిఘా కెమెరాల పనితీరు, విద్యార్థినులు, సిబ్బంది హాజరు వివరాలను తెలుసుకున్న కలెక్టర్ తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. విద్యార్థినుల అభ్యాస స్థాయిని మెరుగుపరిచేలా బోధన, పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. భోజనం తయారీలో పరిశుభ్రత, నాణ్యతకు



ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోగ్య పరిరక్షణలో రాజీ పడరాదన్నారు. పాఠశాల, వసతి గృహాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యార్థినుల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకుల విద్యాసంస్థలు విద్యార్థినుల భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ తనిఖీలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు, సంబంధిత అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# చెత్త తరలింపులో నిర్లక్ష్యానికి తావులేదు

- జంక్షన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్
- అల్వాల్‌లో కీలక జంక్షన్ల పరిశీలన



**వేద న్యూస్, మల్కాజిగిరి:**

అల్వాల్ సర్కిల్ పరిధిలోని టిమ్స్ రాజీవ్ గాంధీ విగ్రహం జంక్షన్, ఏడబ్ల్యూహెచ్ఓ కాలనీ సమీప ప్రాంతాలను మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుధ్యం, ట్రాఫిక్ సౌలభ్యం, జంక్షన్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జంక్షన్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణతో పాటు సెకండరీ కలెక్షన్ పాయింట్ల వద్ద వ్యర్థాలను వెంటనే తరలించాలని సూచించారు. ప్రధాన జంక్షన్ల వద్ద ఆక్రమణలు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనధికార నిర్మాణాలు, వ్యాపార కార్యకలాపాల వల్ల ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. హెచ్‌టీ లైన్ రీడిజైన్ ప్రాజెక్ట్ డాక్యుమెంట్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదం కోసం వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులను త్వరగా పొందాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులను పూర్తి చేయాలని సూచించారు. తనిఖీలో సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# భూసేకరణ వేగవంతం చేయాలి

- రైతుల ఖాతాల్లో పరిహారం జమ
- అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశం

**వేద న్యూస్, గద్వాల:**



జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. అవార్డు ప్రక్రియ పూర్తయిన రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయాలని సూచించారు. నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలు, మల్లమ్మకుంట రిజర్వాయర్ భూసేకరణపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల, రెవెన్యూ, భూసేకరణ శాఖలు సమన్వయంతో పనిచేసి పనులకు ఉన్న అడ్డంకులను తొలగించాలని కలెక్టర్ సూచించారు. జూరాల కుడి కాలువ పరిధిలో చివరి డిస్ట్రిబ్యూటర్ల వరకు నీటి సరఫరాపై ఇరిగేషన్ అధికారులు స్పష్టతతో వ్యవహరించాలని అన్నారు. పంట చేతికొచ్చే వరకు రైతులకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ భూసేకరణ అడ్డంకులను అధిగమించి రైతులకు విస్తృతంగా సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఇరిగేషన్ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# పాలు, పెరుగు ధరలు తగ్గించాలి

- కార్మికులు, పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలి - కరీంనగర్ డైరీపై సీపీఐ నేత పైడిపల్లి రాజు ఆగ్రహం



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ డైరీ పాలు, పెరుగు ధరలను తరచూ పెంచుతూ ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆరోపించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాతో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లోనూ డైరీ పాలు విక్రయిస్తున్న నేపథ్యంలో ఇష్టారాజ్యంగా ధరలు పెంచడం సరికాదన్నారు. డైరీలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని, పాడి రైతులకు కూడా తగిన ధర కల్పించడం లేదని ఆరోపించారు. అయినప్పటికీ పాలు, పెరుగు ధరలను మాత్రం పెంచుతున్నారని విమర్శించారు. తరచూ రూ.2, రూ.3 చొప్పున ధరలు పెంచుతూ ప్రజలపై కోట్ల రూపాయల అదనపు భారం మోపుతున్నారని అన్నారు. పాల నాణ్యత, వాటి తయారీలో ఉపయోగించే పదార్థాలపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని కోరారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే అంశాలుంటే చర్యలు తీసుకోవాలని సూచించారు. పెంచిన పాలు, పెరుగు ధరలను వెంటనే తగ్గించి వినియోగదారులకు ఉపశమనం కల్పించాలని పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అన్యాయం

- నిరుపేద కుటుంబాల పేర్లు తొలగించారని ఆరోపణ
- తుది జాబితా ప్రకటించకుండా ఇళ్ల పంపిణీపై విమర్శలు
- సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తుండగా అరెస్ట్
- సామాజిక ఉద్యమకారుడు సావనపెల్లి రాకేష్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిరుపేద కుటుంబాలకు అన్యాయం జరిగిందని సామాజిక ఉద్యమకారుడు, అంబేద్కర్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు సావనపెల్లి రాకేష్ ఆరోపించారు. ఇల్లంతకుంటలోని పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇల్లంతకుంటలో 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారని, గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజల సమక్షంలో 40 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసి అధికారికంగా ప్రకటించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇందిరమ్మ కమిటీ పేరుతో మొదటి జాబితాలోని కొందరి పేర్లను తొలగించారని ఆరోపించారు. తుది లబ్ధిదారుల జాబితాను అధికారికంగా ప్రకటించకుండానే ఇళ్ల పంపిణీ చేపట్టడం బాధాకరమన్నారు. రాజకీయ నాయకులకు అనుకూలంగా ఉన్నవారిని ఎంపిక చేసి, గతంలో ఎంపికైన నిరుపేద కుటుంబాలను తొలగించారని విమర్శించారు. దీనిపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విన్నవించేందుకు వెళ్తుండగా ఇల్లంతకుంట పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు.



ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని రాకేష్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు దాసరి కిషోర్, ఒళ్యాల శ్రీనివాస్, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పాఠశాలల్లో ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ




**వేద న్యూస్, ఆదిలాబాద్:**

భుక్తాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంతో పాటు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, కంటి సంరక్షణ, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని అధికారులు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పాఠశాలల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో నిరంతరం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ కంటి చూపు సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు అందిస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాధన, కౌన్సిలర్ ప్రకాష్, వైద్యులు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రమేష్ రెడ్డి, డీబీసీఓ కృష్ణ, ఆర్బీఎస్‌కే వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డంప్‌యార్డ్‌ను వెంటనే తరలించాలి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలి




- ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడాలి
- మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ రక్షణ సేన ధర్నా

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి ఇబ్బందిగా మారిన డంప్‌యార్డ్‌ను వెంటనే నగరానికి దూరంగా తరలించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. డంప్‌యార్డ్ తరలించాలని కోరుతూ శనివారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ సుమారు 150 మెట్రిక్ టన్నుల చెత్త డంప్‌యార్డ్‌కు చేరుతోందని తెలిపారు. ఇప్పటికే సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, పొగ, దోమలు, కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డంప్‌యార్డ్ తరలింపునకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించినా ఆశించిన పురోగతి లేదని విమర్శించారు. పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్ ద్వారా శాస్త్రీయంగా తొలగించాలని, తడిపొడి చెత్తను పూర్తిస్థాయిలో వేరు చేసి ప్రాసెసింగ్ చేయాలని డిమాండ్ చేశారు. డంప్‌యార్డ్ తరలింపు ప్రక్రియను వేగవంతం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే మరిన్ని ఆందోళనలు చేపడతామని హరిప్రసాద్ హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య

**వేద న్యూస్ హైదరాబాద్ :**

నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న ఎంబీబీఎస్ విద్యార్థిని యశ్విత శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో ఆత్మహత్యకు పాల్పడింది. కర్నూలుకు చెందిన వ్యాపారి రామ్మోహన్‌రెడ్డి ఏకైక కుమార్తెగా పోలీసులు గుర్తించారు. గత ఆరు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటూ పరీక్షకు శిక్షణ పొందుతున్న ఆమె.. తాను బస చేస్తున్న గదిలోనే బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు యువతకు అవకాశం

- ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2026-27కు దరఖాస్తుల ఆహ్వానం
- 63 నైపుణ్య విభాగాల్లో వివిధ దశల్లో పోటీలు
- సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో నమోదు

**వేద న్యూస్, మందమర్రి:**




యువత తమ నైపుణ్యాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2026-27ను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి. దేవానంద్ తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు, ఇతర నైపుణ్యాభ్యర్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 63 నైపుణ్య విభాగాల్లో జిల్లా, రాష్ట్ర, రీజినల్, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. 16 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న యువతీ, యువకులు సెప్టెంబర్ 15లోగా స్కిల్ ఇండియా డిజిటల్ హబ్‌లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలకు ప్రత్యేక శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రపంచ స్థాయిలో చాటుకోవాలని దేవానంద్ కోరారు.

# సిరిసిల్లలో మూతపడ్డ మున్సిపల్ మరుగుదొడ్లు

- ఫారెస్ట్ కార్యాలయం పక్కన అధ్వానంగా పబ్లిక్ టాయిలెట్లు
- దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయం పక్కన ఉన్న మున్సిపల్ పబ్లిక్ మరుగుదొడ్లు చాలా రోజులుగా మూతపడి నిరుపయోగంగా మారాయి. పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఆర్డీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ప్రాంతానికి వస్తుంటారు. మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాధనంతో నిర్మించిన మరుగుదొడ్లను నిర్వహణ లేకుండా వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పరిసరాలను శుభ్రం చేసి, మరుగుదొడ్లను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



- వైరల్‌గా మారిన శ్రామిక బిడ్డ అరుణ్ జీవితం
- లారీ డ్రైవర్ నెహ్రూ అండతో అక్షరాలు నేర్చుకున్న యువకుడు
- ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పూర్తి
- పేదరికాన్ని అధిగమించి స్ఫూర్తిగా నిలిచిన అరుణ్

# బొగ్గు మసిలో విరిసిన నవ్వు.. లారీ క్యాబిన్‌లో చదువు!

**వేద న్యూస్,**

రహదారి పక్కన నిలిచిన లారీ.. చేతిలో టీ కప్పు.. ముఖంలో స్వచ్ఛమైన నవ్వు.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఆ దృశ్యం వెనుక ఓ శ్రామిక బిడ్డ జీవన పోరాటం ఉంది. సరదాగా తీసిన ఓ వీడియోతో కోట్లాది మందికి పరిచయమైన ఆ ముఖం.. ఇప్పుడు అక్షర జ్ఞానంతో కొత్త దిశగా అడుగులు వేస్తోంది. మహాముత్తారం మండలం కర్లకుంట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ చిన్నతనంలోనే పేదరికం కారణంగా చదువుకు దూరమయ్యాడు. కుటుంబ పరిస్థితులు సహకరించక నాలుగో తరగతితోనే బడి మానేసి బొగ్గు గనుల ప్రాంతంలో లారీ క్లీనర్‌గా పనిలో చేరాడు. బొగ్గు దుమ్ము, లారీ ప్రయాణాలు, కాయకష్టం అతని జీవితంలో భాగమయ్యాయి.

**ఒక నవ్వు.. కోట్ల మందికి చేరింది..**

బొగ్గు లోడింగ్ పాయింట్ వద్ద పని ముగించుకుని స్నానం చేసి కొత్త దుస్తులు ధరించిన అరుణ్.. టీ తాగుతున్న సమయంలో లారీ డ్రైవర్ నెహ్రూ చేసిన సరదా వ్యాఖ్యకు హాయిగా నవ్వాడు. కొత్త దుస్తులు పాడవుతాయేమోనన్న అమాయకత్వంతో టీ కప్పును కాస్త దూరంగా పట్టుకుని నవ్విన ఆ క్షణాన్ని నెహ్రూ తన ఫోన్‌లో చిత్రీకరించాడు. సరదాగా సోషల్ మీడియాలో పెట్టిన ఆ వీడియో అనూహ్యంగా వైరల్ అయింది. అరుణ్ నవ్వు అనేక మీమ్స్, రీల్స్‌లో కనిపించింది. కామెడీ సందర్భాల్లో ఉపయోగించే వైరల్ రియాక్షన్ మీమ్‌గా అతని ముఖానికి గుర్తింపు వచ్చింది.

**కామెంట్లు చదవలేని బాధతో..**

వీడియోకు వేలాది కామెంట్లు రావడంతో వాటిని అరుణ్‌కు చదివి వినిపించాలని నెహ్రూ భావించాడు. అయితే అరుణ్‌కు చదవడం రాదని తెలుసుకుని బాధపడ్డాడు. తానూ పేదరికం కారణంగా చదువును మధ్యలోనే ఆపాల్సి వచ్చిన వ్యక్తి కావడంతో.. అరుణ్ జీవితం కూడా లారీ చక్రాల మధ్యే ఆగిపోకూడదని నిర్ణయించుకున్నాడు.

**లారీ క్యాబిన్‌నే తరగతి గదిగా మార్చి..**

ప్రయాణాల మధ్య దొరికిన సమయాన్ని అరుణ్ చదువుకు కేటాయించాడు నెహ్రూ. లారీ క్యాబిన్‌నే తరగతి గదిగా మార్చి, రహదారి పక్కన లారీ నిలిపి హెడ్‌లైట్ల వెలుతురులో అక్షరాలు నేర్పించాడు. పుస్తకాలు కొనిచ్చి, చదువుకు అవసరమైన ఖర్చులను భరించాడు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాసేలా ప్రోత్సహించాడు. ఎన్నో కష్టాలను అధిగమించిన అరుణ్ చివరకు పదో తరగతి పూర్తి చేశాడు. ఒకప్పుడు పాఠశాల గడప దాటలేకపోయిన శ్రామిక బిడ్డ.. ఇప్పుడు అక్షరాల విలువ తెలుసుకుని జీవితాన్ని మార్చుకునే దిశగా ముందుకు సాగుతున్నాడు. సోషల్ మీడియా అతని నవ్వును వైరల్ చేసింది. కానీ అతని జీవితాన్ని మార్చింది మాత్రం లారీ డ్రైవర్ నెహ్రూ చూపిన మానవత్వం, విద్యపై కల్పించిన నమ్మకం. అరుణ్ కథ పేదరికం చదువుకు అడ్డంకిగా నిలిచినా, అవకాశం లభిస్తే జీవితాన్ని మార్చుకోవచ్చనే సందేశాన్ని అందిస్తోంది. బొగ్గు మసిలో పుట్టిన ఆ నవ్వు.. ఇప్పుడు అక్షరాల వెలుగులో మరింత ధగధగలాడుతోంది. శ్రమకు గౌరవం, విద్యకు అవకాశం, తోడుగా నిలిచే మంచి మనిషి ఉంటే ఏ చీకటి జీవితాన్నైనా వెలుగుబాట పట్టించవచ్చని అరుణ్ జీవనగాథ చాటిచెబుతోంది.

# బ్రేక్ బదులు యాక్సిలరేటర్.. వృద్ధుడి మృతి

**వేద న్యూస్ హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో విషాదం చోటుచేసుకుంది. కొత్త కారు పూజకు వచ్చిన ఓ కుటుంబంలో ప్రమాదం జరిగింది. బ్రేక్‌కు బదులుగా యాక్సిలరేటర్ గట్టిగా తొక్కడంతో కారు ముందుకు దూసుకెళ్లి 70 ఏళ్ల తుమ్ములపల్లి రామచంద్రరావును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన రామచంద్రరావు వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ వచ్చారు. మేనల్లుడు కొత్త కారు కొనడంతో పూజ చేయించేందుకు కుటుంబంతో కలిసి ఆలయానికి వెళ్లారు. పూజ అనంతరం కారు కదిలించే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073